క్లుప్తంగా

25న జాతీయ సదస్సు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఈ నెల 25న నిరుద్యోగుల సమస్యలపై విజయవాడలో జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు డీవైఎఫ్‌ఐ నగర కార్యదర్శి ఓబులేసు పేర్కొన్నారు. బుధవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విఫలం చెందిందన్నారు. రాష్ట్ర విభజన చట్టంలో తెలిపిన విధంగా రాష్ట్రానికి ప్రత్యేకహోదా, జిల్లాలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయకుండా మోసం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ నాయకులు షాకీర్, వినోద్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

వైవీయూలో గిడుగు జయంతి వారోత్సవాలు



గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి వారోత్సవాలలో పాల్గొన్న విద్యార్థులు

వైవీయూ : వైవీయూ తెలుగుశాఖ విభాగం ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈనెల 23 నుంచి 29 వరకు తెలుగుభాషా సాహిత్యాలకు గిడుగు చేసిన సేవలపై విద్యార్థుల్లో అవగాహన తీసుకురావడంలో భాగంగా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలుగుశాఖ విభాగాధిపతి ఆచార్య జి. పార్వతి పేర్కొన్నారు. తెలుగుశాఖ ఆచార్యులు పాలెం రమాదేవి, ఆచార్య ఎస్. ఈశ్వరరెడ్డి, ఆచార్య ఎం.ఎం. వినోదినిలు మాట్లాడుతూ వ్యవహారిక భాషను పాఠ్యగ్రంథాల్లోకి తీసుకురావడానికి గిడుగు చేసిన సేవలను కొనియాడారు. గిడుగు సేవలను గుర్తుచేసుకుంటూ ఈనెల 29న తెలుగు భాషా దినోత్సవం నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు.

రోడ్ల నిర్మాణానికి ప్రణాళికలు



జర్నలిస్టు కాలనీలో స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్: కడప నగర శివార్లలో రామాంజనేయపురంలో ఉన్న జర్నలిస్టు కాలనీ, వరదకాలనీల్లో రోడ్ల నిర్మాణానికి తగిన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన 3వ డివిజన్‌లో పలు ప్రాంతాలను పరిశీలించారు. మురికినీరు ప్రవహించేలా మురికి నీటి కాలువలు నిర్మించాలన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. వైఎస్సార్ సర్కిల్ నుంచి జేఎంజే కాలేజ్ వరకూ రోడ్డుకు ఇరువైపులా మొక్కలను నాటాలన్నారు. ఈ ప్రాంతంలో వందశాతం చెత్త సేకరణ జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. మాసాపేటలో చెత్తను స్వీకరించే క్లాప్ వాహనాలు ప్రతిరోజూ వెళ్లేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో 3వ డివిజన్ ఇన్‌చార్జి సుదర్శన్‌రెడ్డి, వార్డు సచివాలయ సెక్రటరీలు పాల్గొన్నారు.

కేవీకేను సందర్శించిన ఆచార్య ఎన్‌జీ రంగ డీన్



కేవీకేలో ల్యాబ్‌ను పరిశీలిస్తున్న అగ్రికల్చర్ డీన్ సుధాకర్

కడప అగ్రికల్చర్: ఆచార్య ఎన్‌జీరంగ వ్యవసాయ విశ్వవిద్యాలయం గుంటూరుకు చెందిన అగ్రికల్చర్ డీన్ సుధాకర్ బుధవారం ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కేవీకేలో అందిస్తున్న సేవలు, సాంకేతిక కార్యక్రమాల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన పలు అంశాలపై శాస్త్రవేత్తలతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 2వ తేదీన పులివెందుల్లో వ్యవసాయ కళాశాలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో వ్యవసాయ విద్యపై ఆసక్తి కలిగిన విద్యార్థులకు ఇది ఒక మంచి అవకాశం అన్నారు. వ్యవసాయ బీఎస్సీ హానర్స్ మరియు బీఎస్సీ కమ్యూనిటి సైన్సు కోర్సులకు సంబంధించిన విద్యార్థులకు రెండవ విడత కౌన్సిలింగ్ సెప్టెంబర్ 2వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కేవీకే సమన్వయకర్త డాక్టర్ వీరయ్య, ఏరువాక కేంద్ర సమన్వయకర్త డాక్టర్ మురళీకృష్ణ, వ్యవసాయ పరిశోధనస్థానం అధిపతి శ్రీనివాసాచారి, కేవీకే, ఏరువాక కేంద్ర, వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

పండ్ల తోటల పరిశీలన

వీరపునాయునిపల్లె: ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలోని పాయసంపల్లె గ్రామంలో 2023–24కు సంబంధించి సాగు చేసిన పండ్ల తోటలను బుధవారం డ్వామా పీడీ యదుభూషణ్‌రెడ్డి పరిశీలించారు. పండ్లతోటల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఉపాధి హామీ పథకం ద్వారా వారికి అందించే లబ్ధి గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

అంబరమంటిన సంబరం

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఆధ్వర్యంలో గతనెల 14న ప్రయోగించిన చంద్రయాన్-3 మిషన్ ప్లానింగ్ షెడ్యూల్ ప్రకారం విక్రమ్ ల్యాండర్ బుధవారం 6.04 నిమిషాలకు చంద్రుని దక్షిణ ధృవంపై దిగింది. దీంతో అంతరిక్ష రంగంలో భారత్ సరికొత్త చరిత్రను సృష్టించడంతో జిల్లావాసుల్లో ఆనందం నెలకొంది. సాయంత్రం 5.30 గంటల నుంచే జిల్లాలోని పలు విద్యా సంస్థలు, ప్రముఖ వీధులు, పార్కుల్లో చంద్రయాన్-3 ల్యాండింగ్‌ను వీక్షించేందుకు పలువురు భారీ స్క్రీన్‌లు ఏర్పాటు చేసి విజయోత్సాహాలను నిర్వహించారు. - వైవీయూ



ఫొటోగ్రాఫర్, వీడియోగ్రాఫర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంబరాలు



కడప నగరం నాగరాజుపేటలో...



కేక్ కట్ చేసి సంబరాలు చేస్తున్న 20వ డివిజన్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి శ్రీరంజన్‌రెడ్డి



రాజీవ్‌మార్గ్‌లో ఏర్పాటు చేసిన భారీ స్క్రీన్‌పై వీక్షిస్తున్న కడప ప్రజలు

41 రోజుల ప్రయాణం విజయతీరాలకు చేరింది..



విక్రమ్ ల్యాండర్ 41 రోజుల పాటు ప్రయాణం చేసి అందరూ ఆశించిన విధంగా సాఫ్ట్‌ల్యాండింగ్ అయింది. 2019లో చంద్రయాన్–2 విఫలమైన తర్వాత ఇస్రో శాస్త్రవేత్తలు మిషన్‌ను ఛాలెంజ్‌గా తీసుకుని విజయవంతం చేశారు. రష్యాకు చెందిన లూనా 25 ఇటీవల విఫలం కావడంతో యావత్ ప్రపంచం చంద్రయాన్–3పై ఆసక్తిగా చూసింది. చంద్రయాన్–3 విజయంలో కీలకపాత్ర పోషించిన మూన్‌స్టార్‌లు అందరికీ శుభాకాంక్షలు.

– ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, భౌతికశాస్త్ర ఆచార్యులు, వైవీయూ

రాజీవ్ పార్కు వద్ద ఎల్‌ఈడీ స్క్రీన్‌ద్వారా ప్రత్యక్ష ప్రసారం

కడప కార్పొరేషన్: చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతమవడంపై కడప నగరంలో సంబరాలు మిన్నంటాయి. స్థానిక రాజీవ్ మార్గ్‌లో రాజీవ్ పార్కు వద్ద కడప నగరపాలక సంస్థ కమిషనర్ ప్రవీణ్‌చంద్ ఆధ్వర్యంలో ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేసి లైవ్‌లో వీక్షించే అవకాశం కల్పించారు. చంద్రుని దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టడాన్ని ప్రత్యక్షంగా చూసిన పిల్లలు, పెద్దలు కేరింతలు కొట్టారు. చంద్రయాన్–3 సూపర్ సక్సెస్ అయిన తర్వాత జాతీయ జెండాలు చేతబట్టుకొని జయహో భారత్ అంటూ నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా 20వ డివిజన్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి శ్రీరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, ఒకరినొకరు పంచుకొని సంతోషం వ్యక్తం చేశారు. నగర ప్రజలు టీవీలలో వీక్షించి ఆనందం వ్యక్తం చేసుకున్నారు.

– ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమన్వయక వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.

– ఎస్‌టీయూ జిల్లా మైనార్టీ కన్వీనర్ నజీబుల్లా , జేకే యూత్ అధ్యక్షుడు ఖాదర్‌బాషా, మను కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ సికిందర్ తదితరులు చంద్రయాన్ విజయవంతంపై హర్షం వ్యక్తం చేశారు.

పథకాల అమలులో దేశానికే ఆదర్శం

– డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్ బాషా అన్నారు. బుధవారం ×గడప గడపకు మన ప్రభుత్వం× కార్యక్రమంలో భాగంగా 22వ డివిజన్ నారాయణ స్కూల్ ఎదురుగా రాజారెడ్డి వీధిలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల వారికి కలిగిన లబ్ధిని వివరించారు. ఇంకా ఏవైనా పథకాలు అర్హులకు అందడం లేదా ..అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శివప్రసాద్, జి. శ్రీనివాసులు అనే వ్యక్తులు మాట్లాడుతూ తాము బాడుగ ఇళ్లలో ఉన్నామని, తమకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని కోరారు. రాజేశ్వరి అనే మహిళ మాట్లాడుతూ తనకు వైఎస్సార్ సున్నావడ్డీ,



ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

వైఎస్సార్ చేయూత, పింఛన్ కానుక, విద్యాదీవెన, వసతి దీవెన, ఇంటి స్థలం ద్వారా రూ.10.97 లక్షలు మేలు జరిగిందని సంతోషం వ్యక్తం చేసింది. ఎస్. మల్లిక అనే మహిళ మాట్లాడుతూ జగనన్న అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, పింఛన్ కానుక, ఇంటి స్థలం ద్వారా రూ. 10.02లక్షల లబ్ధి చేకూరిందని తెలిపింది.

పోలు చిట్టిబాబు అనే వ్యక్తి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో వైఎస్సార్ ఆసరా, సున్నావడ్డీ, పింఛన్ కానుక, ఇంటి స్థలం ద్వారా రూ.9.58 లక్షలు మేలు జరిగిందని, మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్, 22వ డివిజన్ ఇన్‌చార్జి రామచంద్రయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు తోటక్రిష్ణ, కె. కొండయ్య, పస్తం అంజి, నాగేంద్ర, రత్నకుమారి, పత్తిరాజేశ్వరి, బండి మరియలు, ఉమామహేశ్వరి, సుశీలమ్మ , విజయ కుమారి పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే దిక్సూచి

• కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

వేముల: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థ దేశానికే దిక్సూచిగా నిలుస్తోందని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొత్తపల్లె గ్రామంలో బుధవారం పాడా ఓఎస్డీ అనిల్ కుమార్‌రెడ్డి, మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, జెడ్పీటీసీ బయపురెడ్డిలతో కలిసి సచివాలయం, ఆర్‌బీకే, వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను ప్రారంభించారు. అంతకుముందు గ్రామంలోని రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సచివాలయంలో కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సచివాలయాలను ఏర్పాటు చేసి ఇంటి వద్దకు పాలన తీసుకొచ్చి గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యాన్ని జగనన్న సాకారం చేశారన్నారు. జగనన్న అమలు చేస్తున్న పథకాలతో రాష్ట్రం దేశంలోనే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. గతంలో ప్రజలు పనుల కోసం మండల కార్యాలయాలకు వెళ్లేవారని దీంతో కాలయాపనతో పాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే వారన్నారు. ఇబ్బందులు లేకుండా ప్రజల వద్దకే ప్రభుత్వ పాలన తీసుకురావడంతో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఏపీని ఆదర్శంగా తీసుకుని దేశంలోని ఇతర రాష్ట్రాలు



వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

సచివాలయాలు ఏర్పాటు చేసేందుకు ముందుకు రావడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గంగాదేవి, మండల పరిశీలకుడు రామలింగారెడ్డి, బీసీబీ డైరెక్టర్ మరకా శివకృష్ణారెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు లీలావతి పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. బుధవారం కొత్తపల్లె గ్రామంలో సచివాలయాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన ప్రజా దర్బార్ నిర్వహించారు.

ఒత్తిడిని అధిగమించిన యువత దేశానికి శక్తి

– రామకృష్ణ మిషన్ స్వామి భీతిహరానంద

కడప కల్చరల్ : నేటి యువత పలు కారణాల వల్ల సమస్యలు, సవాళ్లను ఎదుర్కొంటూ మానసిక ఒత్తిడికి గురవుతోందని, దీన్ని అధిగమిస్తే దేశానికి గొప్ప శక్తి లభిస్తుందని రామకృష్ణ మిషన్ స్వామిజీ భీతిహరానంద అన్నారు. మిషన్ ఆవరణలో యువజన సమ్మేళన కార్యక్రమాన్ని స్వామిజీ ప్రారంభించారు. యువత ఒత్తిడిని ఎదుర్కొనే మార్గాలను తెలిపి వారిలో ఆత్మవిశ్వాసాన్ని, వికాసాన్ని కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. స్వామి సన్నివాశానంద మాట్లాడుతూ మన సంస్కృతిలో సంకుచితత్వం, స్వార్థ చింతన లేదని విశాల భావన కలిగిన వసుధైక కుటుంబం మన సాంస్కృతిక వారసత్వమని వివరించారు. వైవీయూ ఆచార్యులు రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఒక స్త్రీ విద్యావంతురాలైతే ఆ కుటుంబమంతా విద్యావంతులవుతుందని అభిప్రాయపడ్డారు. గౌరవ అతిథి, ఆర్టీసీ ఈడీ జి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ యువత సమస్యల పరిష్కారానికి, ఆలోచన విధానం, జీవిత లక్ష్యాలు, గమ్యాలు సరిలేకపోవడమేనన్నారు. రెండవ విభాగంలో స్వామి జయగోపాలనంద సందేశం ఇచ్చారు. యోగా నిపుణులు డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి యువతకు యోగా ఆవశ్యకతను వివరించారు. రిటైర్డ్ లెక్చరర్ శివరామిరెడ్డి కూడా మాట్లాడారు. స్వామి సంకర్షణానంద, ఆదినారాయణ సభను పర్యవేక్షించారు. దాదాపు 400 మందికి పైగా వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న రామకృష్ణ మిషన్ స్వామిజీ భీతిహరానంద

తెలుగుభాషపై వ్యాసరచన పోటీ

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన ప్రగతి కాంపిటీషన్ క్లబ్, విశ్వాత్మ పిరమిడ్ యోగా, ధ్యాన కేంద్రం సంయుక్తంగా తెలుగుభాషపై వ్యాసరచన పోటీ నిర్వహించనుందని ఆ సంస్థల ప్రతినిధి జీవీ శేషారెడ్డి తెలిపారు. ఈ నెల 29 న తెలుగు భాషోద్యమకర్త గిడుగు రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని ఈ పోటీ నిర్వహిస్తున్నామన్నారు. దేశ భాషలందు తెలుగులెస్స అనే అంశంపై నాలుగు పేజీలకు మించని వ్యాసం పంపాల్సి ఉందన్నారు. ఇందులో ఆంగ్ల పదాలను ఉపయోగించకూడదని సూచించారు. వ్యాసాలను ఈ నెల 27వ తేదీలోగా ప్రగతి కాంపిటీషన్ క్లబ్, ప్లాట్ నెంబరు 125డి, గౌతమబుద్ధ టౌన్‌షిప్, ప్రకాశ్‌నగర్, కడప అనే చిరునామాకు చేరేలా పంపాలన్నారు. వివరాలకు 80748 26819 నంబరులో సంప్రదించాలన్నారు.

ఆంధ్రకేసరికి ఘన నివాళి



కడప కేంద్రకారాగారంలో టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న అధికారులు, సిబ్బంది

కడప అర్బన్: ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను బుధవారం కడపలోని కేంద్రకారాగారంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కడప కేంద్రకారాగార సూపరింటెండెంట్ ఐ.ఎన్.హెచ్ ప్రకాష్ తదితరులు.. టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ ప్రకాశం పంతులు సుప్రసిద్ధ స్వాతంత్ర్య సమరయోధుడన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రి అయ్యారన్నారు. నిరుపేద కుటుంబంలో పుట్టి కష్టపడి చదువుకున్నారన్నారు. ఆంధ్ర రాజకీయాల్లో ప్రముఖంగా వెలుగొందిన వ్యక్తుల్లో ప్రకాశం ఒకరన్నారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్‌లు కె. జవహర్‌బాబు, ఏ. సాంబశివరావు, జైలర్లు, డిప్యూటీ జైలర్లు, మినిస్టీరియల్ సిబ్బంది, వైద్య సిబ్బంది, గార్డింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ప్రకాశం పంతులు జయంతి

కడప ఎడ్యుకేషన్: కడప ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో బుధవారం ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రాజారావు ఆధ్వర్యంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ హమీబుల్లాలు టంగుటూరు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు హరిప్రసాద్‌రెడ్డి, శ్రీరాములరెడ్డి, చంద్రమౌళి, వెంకట్రామిరెడ్డి, అమృతరాజు, యోగీశ్వరరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏఎఫ్‌యూలో..

ఏఎఫ్‌యూ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్ ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు నిర్వహించారు. బుధవారం ఆంధ్రకేసరి చిత్రపటానికి రిజిస్ట్రార్ డా. ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో బ్రిటీష్ వారి తుపాకీగుళ్లకు ఎదురొడ్డి పోరాడిన ధీరుడు టంగుటూరి ప్రకాశం పంతులు అని కొనియాడారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ వై. పవన్ కుమార్‌రెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డా. ఇ.సి. సుప్రియ, నేషనల్ ఈవెంట్ కోఆర్డినేటర్ మనోహర్‌రావు పాల్గొన్నారు.



టంగుటూరి జయంతి కార్యక్రమంలో రిజిస్ట్రార్ డా. ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి

సమస్యల పరిష్కారం కోసమే గడప గడపకు ..

• ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

చెన్నూరు : ఎక్కడన్నా మిగిలి ఉన్న సమస్యలను తెలుసుకొని క్షేత్రస్థాయిలో వాటిని పరిష్కరించడమే గడపగడపకు మన ప్రభుత్వం లక్ష్యమని, అలాగే అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు, బుధవారం చెన్నూరు టౌన్‌లోని కొత్త గాంధీనగర్ పరిధిలోని కుమ్మర కాలనీ, ఎరుకల కాలనీ, బెస్త కాలనీ, బుద్దాయపల్లి గ్రామాలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పి.రవీంద్ర నాథ్‌రెడ్డి, ఆయన తనయుడు చింతకొమ్మదిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజనేయులురెడ్డి పాల్గొన్నారు. గడపగడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ ఏ కుటుంబానికి ఎంతెంత లబ్ధి చేకూరిందో తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆదరించి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్ రెడ్డి , ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆర్‌వీఎస్‌ఆర్, వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ ముదిరెడ్డి సుబ్బారెడ్డి, కమలాపురం నియోజకవర్గం మైనార్టీ కన్వీనర్ అన్వర్‌బాషా, మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చెన్నూరు బెస్తకాలనీలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

రామాలయ ప్రారంభోత్సవం

చింతకొమ్మదిన్నె: మండలంలోని యర్రమాచుపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయ ప్రారంభోత్సవ వేడుకల్లో కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు. మంగళవారం, బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజలు జరగ్గా, బుధవారం శ్రీ సీతారామ లక్ష్మణ హనుమత్ గణపతి సహిత ధ్వజ యంత్ర ప్రతిష్ఠ, సీతారాముల వారి శాంతి మహోత్సవం, హోమాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోకటం లక్ష్మీనారాయణ రెడ్డి, మునిరెడ్డి, నాగమల్లారెడ్డి పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా ఇంటింటి పరిశీలన పూర్తి

కడప సెవెన్‌రోడ్స్ : కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ–2024లో భాగంగా బీఎల్‌ఓలు నిర్వహించిన ఇంటింటి పరిశీలన కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశామని ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి అన్నారు. బుధవారం తన చాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఎల్‌ఓలు, బీఎల్‌ఏలు ఇంటింటికి వెళ్లి మరణించిన, వలస వెళ్లిన, వివాహాలు చేసుకుని వెళ్లిపోయిన, డబల్ ఎంట్రీలు వంటి వాటిని గుర్తించారన్నారు. ఎన్నికల సంఘం ఇచ్చిన నాలుగు అర్హత తేదీలనుసరించి అర్హులయ్యే వారి నుంచి ఓటరు నమోదుకు దరఖాస్తులు స్వీకరించారని తెలిపారు. అలాగే ఫారం–8లు కూడా స్వీకరించామన్నారు. ఒక దశ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన రాజకీయ పార్టీలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్ శివరామిరెడ్డి, కార్పొరేటర్ అజంతుల్లాఖాన్, బీజేపీ నాయకులు లక్ష్మణ్‌రావు, బీఎస్పీ నాయకుడు కానుగ దానం, సీపీఐ నగర కార్యదర్శి వెంకట శివ, ఆప్ నాయకులు శ్రీనివాసులు, దేవర కృష్ణ, టీడీపీ నాయకుడు లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి

చట్టాలపై అవగాహన ఉండాలి



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి

కడప కోటిరెడ్డిసర్కిల్ : బాలల చట్టాల పట్ల ఐసీడీఎస్ సూపర్‌వైజర్లకు అవగాహన ఉండాలని ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలక్ష్మి తెలిపారు. బుధవారం డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో ఆ శాఖ సూపర్‌వైజర్లకు నిర్వహించిన ఒకరోజు శిక్షణా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అంగన్వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులతో కలిసి సూపర్‌వైజర్లు పని చేస్తుంటారు గనుక బాల్య వివాహాలను అడ్డుకోవాలన్నారు. బాల్య వివాహం జరిగే విషయం ముందే తెలుసుకుని కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. బాల్య వివాహాల వల్ల సంభవించే నష్టాలతోపాటు చట్టపరంగా ఎదురయ్యే ఇబ్బందులు వారికి వివరించాలన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో కౌమర దశలో ఉన్న పిల్లలకు బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాలపై అవగాహన కల్పించాలన్నారు. స్వయం సహాయక సంఘ సమావేశాల్లో మహిళలకు కూడా ఈ విషయం పట్ల అవగాహన కల్పించాలని చెప్పారు. కిశోర బాలికల వివరాలు ప్రతి సూపర్‌వైజర్ వద్ద ఉండాలని జిల్లా బాలల పరిరక్షణ అధికారి సుభాష్ యాదవ్ తెలియజేశారు. అంగన్వాడీ కార్యకర్త, మహిళా పోలీసు ద్వారా కిశోర బాలికల గృహాలను సందర్శించి వారిని చైతన్య పరిచాలన్నారు.

ప్రశ్నాపత్రాలను ఉర్దూలో ప్రచురించాలి

కడప ఎడ్యుకేషన్: ఏపీపీఎస్సీ ద్వారా నిర్వహించే అన్ని పోటీ పరీక్షలను సంబంధించిన ప్రశ్నాపత్రాలను ఉర్దూభాషలో కూడా ముద్రించాలని ఎస్టీయూ జిల్లా కన్వీనర్ ఎస్.నజీముల్లా కోరారు. ఈ విషయమై బుధవారం డిప్యూటీ సీఎం అంజాద్‌బాషను క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉర్దూ విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ఉర్దూ భాష రెండవ అధికారిక భాషగా ఉందన్నారు. రాష్ట్రంలో ప్రతి ఏటా వేల మంది విద్యార్థులు ఉర్దూ మీడియంలో గ్యాడ్యుయేట్ పూర్తి చేస్తున్నారన్నారు. ఉర్దూ విద్యార్థులకు ఉద్యోగాల అవకాశాలు తక్కువగా ఉన్నాయన్నారు. కాబట్టి కాంపిటీటివ్ ఎగ్జామ్స్ అయిన గ్రూప్స్ పరీక్షలు, ఎస్‌ఐ, కానిస్టేబుల్ ఏపీ గ్రామ సచివాలయ పోస్టులను కూడా ఉర్దూ భాషలో ముద్రించి పరీక్షలను నిర్వహించాలని కోరారు.